క్లుప్తంగా

నిత్యావసర సరుకులు అందజేత



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని పిల్లిగుండ్ల కాలనీకి చెందిన బుడగ జంగాల జములమ్మ గుడిసె కాలిపోయింది. విషయం తెలుసుకున్న బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు శుక్రవారం కాలిపోయిన గుడిసెను పరిశీలించడంతో పాటు నిత్యావసర సరుకులు, రూ.10వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా బేడ బుడగ జంగం హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిగిరి పట్నం దేవరాజు మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం బేడ బుడగ జంగం జిల్లా మాజీ అధ్యక్షుడు సిరిగిరి కృష్ణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బసన్న తదితరులు ఉన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన



ఎర్రవల్లి: ఇటిక్యాల మండలంలోని కొత్తదేవరపల్లిలో శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఆర్ఓ సారథ్యంలో సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు హాజరై ప్రజలకు బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడం, చదువు వల్ల కలిగే ఉపయోగాలు, మత్తు పదార్థాలను తీసుకోవడం వల్ల కలిగే నష్టాలు, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి పాట, మాటల రూపంలో వివరించారు. కార్యక్రమంలో కళాకారులు రాహుల్, కేశవులు, కృష్ణ, కవిత, భూపతి రమాదేవి, హజరత్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు

మానవపాడు: మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొర్విపాడు గ్రామం నుంచి 17మందికి వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వారందరికీ రక్తపరీక్షలు నిర్వహించి, టీ-హబ్ ద్వారా గద్వాలకు పంపామన్నారు. న్యూట్రిషన్ గురించి రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, ఐరన్‌మాత్రలు గురించి వివరించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్యకేంద్రాల్లో సాధారణ కాన్పులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ హెలెన్, సూపర్‌వైజర్ చంద్రన్న, తిరుమల్‌రావు, రాణి తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సందర్శన



ధరూరు: మండలకేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఎంఈఓ రవీంద్రబాబు శుక్రవారం సందర్శించారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎస్ఏ-1 పరీక్షలను పర్యవేక్షించారు. అనంతరం వంట గదిని పరిశీలించి విద్యార్థుల కోసం వండిన వంటలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యతగా భోజనం అందించాలని వంటవారికి, ఇన్‌చార్జి అధికారికి సూచించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయులకు సంబంధించిన రిజిస్టర్లతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సీఆర్‌పీ నర్సింహులు ఉన్నారు.

మేక పిల్లలపై కుక్కల దాడి

అలంపూర్ రూరల్: పట్టణంలోని సాలేవీధిలో శుక్రవారం మేక పిల్లను కుక్కలు వేటాడి చంపివేశాయి. వారం రోజుల్లో రెండోసారి మేక పిల్లలను కుక్కలు వెంబడించి చంపుడంతో కాపరులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కుక్కల భయానికి చిన్న పిల్లలు, మహిళలు బయటకు రావాలంటే భయాందోళన గురువుతున్నారు. మనుషులపై కూడా దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. దీనిపై అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోవడం లేదని కాలనీ మహిళలు అసహనం చెందుతున్నారు. వెంటనే అధికారులు కుక్కలను తరలించే దిశగా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరారు. ఊరి బయట తుంగభద్ర నది సమీపంలో ఉన్న కాలనీలో చెత్త ఎక్కువగా ఉండడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లోని కంపచెట్లు, చెత్తను తొలగించాలని అధికారులను కోరినా చలనం లేదని కాలనీవాసులు వసంత, లక్ష్మీదేవి, సోమేశ్వరి, సుశీలమ్మ, మాధవి, లాస్య, జయలక్ష్మి, చంద్రకళ, మీనాక్షి, హరిక వెంకటేశ్వర్లు, నాగరాజు, రమేష్ ఆవేదన చెందుతున్నారు.

కొనసాగుతున్న అధికారుల పర్యటన



గద్వాల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన కేంద్ర సర్వీస్ శిక్షణాధికారులు



అలంపూర్‌లో పుట్టిలో ప్రయాణిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు

గద్వాల: సివిల్ సర్వీసుల శిక్షణాధికారులు శుక్రవారం గద్వాల పట్టణంలో పర్యటించారు. మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ కార్యాలయంలో పరిపాలన కార్యాకలాపాలు పరిశీలించారు. అదేవిధంగా పట్టణంలోని సంస్థానాధీశుల పురాతన బావులు లింగంబావి, చొక్కంబావులను, సంగాల పార్కులను సందర్శించారు. ప్రభుత్వ బాలిక ఉన్నత పాఠశాల, వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, హోటళ్లు, చేనేత చీరలు పట్టణంలోని ప్రధాన కూడళ్లు వంటివి పరిశీలించి సంబంధిత అధికారులు, వ్యాపారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అలంపూర్: ట్రెయినీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌ల క్షేత్రస్థాయి పర్యటన కొనసాగింది. అలంపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, కమిషనర్ సరస్వతి ఆధ్వర్యంలో ట్రెయినీ ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాల్లో అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పురాతన ఆలయాలను పరిశీలించారు. ఆలయాల పక్కనే ఉన్న పురావస్తు మ్యూజియంను సందర్శించి అందులోని పురాతన విగ్రహాల చరిత్రను తెలుసుకున్నారు. పాపానాశిని ఆలయాలను సందర్శించి వాటి వివరాలు సేకరించారు. పుట్టిలో ప్రయాణిస్తూ పుష్కర ఘాట్, నది తీర గ్రామాలను, ప్రాంతాలను పరిశీలించారు. కొత్తగా ఆవిర్భవించిన మున్సిపాలిటీల్లో చేపడుతున్నట్లు అభివృద్ధి పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతర్గత రోడ్లు, పారిశుద్ధ్య పనులు, పచ్చదనం, పట్టణ సుందరీకరణ వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

కలెక్టర్‌ను కలిసిన టీజీఓ అధికారులు



గద్వాల: తెలంగాణ గెజిటెడ్ అధికారుల నూతన కమిటీ సభ్యులు శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో కలెక్టర్ బీఎం సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పరంగా వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములై జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీజీవో అధ్యక్షుడు రహీముద్దీన్, కార్యదర్శి శశిధర్‌రెడ్డి, వెంకటరాజురెడ్డి, రాంచంద్రప్ప, భీమ్లా, సతీష్‌కుమార్, రామాంజనేయులు, పవన్, ఖలీం తదితరులు పాల్గొన్నారు.

నిందితులను అరెస్టు చేయాలి

గద్వాల అర్బన్: మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామానికి చెందిన బాలికను బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనికి పెట్టుకోవడమే కాక.. బాలికపై దొంగతనం మోపి, పోలీసులతో ఇబ్బందులకు గురిచేసి బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డి, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బాలిక మృతికి కారణమైన బండ్ల రాజశేఖర్‌రెడ్డితో పాటు పోలీసు అధికారులపై కలెక్టర్, ఎస్పీలు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే జిల్లా, రాష్ట్రస్థాయిలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. వివిధ ప్రజా, కుల సంఘాల నాయకుల ఆధ్వర్యంలో బాలిక మృతికి కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా కేంద్రంలోని క్రిష్ణవేణి చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో జ్యోతి, ఆంజనేయులు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, వాల్మీకి, ఇక్బాల్‌పాషా, గోపాల్, గంజిపేట రాజు, కుర్వ పల్లయ్య, శివరాజ్, ఉస్సేన్ తదితరులు ఉన్నారు.

పురుగు మందు తాగి ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మల్దకల్: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని అమరవాయి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. అమరవాయి చెందిన లక్ష్మన్న కుటుంబ సమస్యలతో కొంతకాలంగా ఇబ్బందులు పడుతుండేవారు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మి కుటుంబ సమస్యలతో బాధపడుతూ పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

నేరగాళ్లతో అప్రమత్తం

కేటీదొడ్డి: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసు అమరుల త్యాగాలను స్మరిస్తూ డయల్ 100 రోడ్డు సేఫ్టీ, సైబర్ క్రైమ్స్, మాదక ద్రవ్యాల వినియోగం పోక్సో కేసులు, సీసీ కెమెరాలపై ఎస్ఐ శ్రీనివాసులు శుక్రవారం మండలంలోని పాగుంటలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరుల త్యాగాల వల్లే పల్లెలు, పట్టణాలు ప్రశాంతంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు రాధమ్మ, రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

ధరూరు: విద్యుత్ శాఖలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తూ ఇటీవలే మృతి చెందిన చెన్నారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శేఖర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సతీమణి, బూరెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బండ్ల జ్యోతి పరామర్శించారు. శుక్రవారం సాయంత్రం చెన్నారెడ్డిపల్లికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులతో మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట శ్రీరాములు, విజయ్ ఉన్నారు.

అయిజ: మండలంలోని ఉప్పలలో మృతి చెందిన మాజీ సర్పంచ్ మహేష్ (50) మృతదేహానికి అలంపూర్ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ దొడ్డెన్న, వైస్ చైర్మన్ కుమార్ శుక్రవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బ్లాస్టింగు బాధితులకు పరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న నర్సింహ

గట్టు: అక్రమంగా మైనింగ్ నిర్వహించడం ద్వారా చేసిన బ్లాస్టింగులో తీవ్రంగా గాయపడిన బాధితులకు పరిహారం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వీవీ నరసింహ డిమాండ్ చేశారు. భారత్ మాల ఆరు రహదారుల నిర్మాణంలో భాగంగా మండలంలోని సల్కాపురం, జోగన్‌గట్టు, తారాపురం గ్రామాల మధ్య సర్వే నంబర్ 199లో టెండర్లు దక్కించుకుని మైనింగ్ చేస్తున్నాడని, దీంతో నిరుపేదలు ప్రమాదాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే మైనింగు క్వారీని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగు చేయడం వల్ల రాళ్లు పొలాల్లో పడుతూ రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారని, గురువారం జరిగిన బ్లాస్టింగ్ కారణంగా తిమ్మప్ప, నవీన్, సరోజమ్మ, పద్మమ్మ కూలీ పనులు చేసుకునే క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితులకు న్యాయం చేసే వరకు తాము పోరాడతామని వారు స్పష్ట చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి నర్మద, సీఐటీయూ నాయకులు స్వామి, శాంతన్న, రెడ్డప్ప, భీమేష్, రైతులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి



వినతిపత్రం అందచేస్తున్న రైతు ఉత్పత్తిదారుల సంఘాల చైర్మన్లు

రాజోళి: రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతు ఉత్పత్తిదారుల సంఘాల చైర్మన్లు జాయింట్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాలో ఐదు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఉండగా.. వాటి ద్వారానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై కలెక్టర్‌తో చర్చిస్తామని జాయింట్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో వడ్డేపల్లి, అయిజ, రాజోళి, గట్టు, ఇటిక్యాల సంఘం చైర్మన్లు వెంకటేశ్వర్లు, యుగంధర్‌రెడ్డి, హనుమంతురెడ్డి, వీరబాబు, రఘురామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమం



అలంపూర్‌లో సీపీఎం జెండా ఆవిష్కరణలో నాయకులు



రాజోళిలో..

అలంపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఎం నిరంతరం ఉద్యమాలు చేస్తోందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు రాజు అన్నారు. సీపీఎం జిల్లా మూడో మహాసభలను పురస్కరించుకొని పట్టణంలో సీపీఎం జెండాను రాజు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో నిర్వహించే సభలకు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు ఎంవీ రమణ హాజరుకానున్నారు. ఈ సభలో ప్రజా సమస్యల పరిష్కారానికి భవిష్యత్ కార్యచరణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె దేవదాసు, జీకే ఈదన్న, నరసింహ, వెంకటస్వామి, అలీ అక్బర్, రహీం తదితరులు ఉన్నారు.

గద్వాలకు బయలుదేరిన సీపీఎం నాయకులు

రాజోళి: గద్వాలలో జరుగుతున్న సీపీఎం మహాసభలకు మండలం నుంచి సీపీఎం నాయకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల నుంచి పార్టీ నాయకులు, అభిమానులు ప్రైవేటు వాహనాల్లో వెళ్లారు. ప్రజా సమస్యలపై నిష్పక్షపాతంగా పోరాటం చేసే సత్తా సీపీఎంకే ఉందని, నిత్యం ప్రజా సమస్యలపై గళం ఎత్తి, ప్రజల తరఫున నిలబడుతున్నామని ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి విజయ్‌కుమార్ అన్నారు.

ఆటో డ్రైవర్‌ను కాపాడిన గజ ఈతగాళ్లు



నదిలో నుంచి బాధితుడిని బయటికి తీసుకొస్తున్న గజ ఈతగాళ్లు

ఎర్రవల్లి: కుటుంబ కలహాలతో కృష్ణానదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఓ ఆటో డ్రైవర్‌ను గజ ఈతగాళ్లు చాకచక్యంగా వ్యవహరించి కాపాడిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇటిక్యాల మండలంలోని మునుగాల గ్రామానికి చెందిన కుర్వ నర్సింహులు ఆటో డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబంలో తరుచుగా గొడవలు జరుగుతుండటంతో మనస్తాపానికి గురై శుక్రవారం సాయంత్రం బీచుపల్లి పుష్కరఘాట్‌కి వచ్చి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిని గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేయగా.. అక్కడే ఉన్న గజ ఈతగాళ్లు వెంటనే నదిలోకి దూకి చాకచక్యంగా వ్యవహరించి అతడిని నది ఒడ్డుకు తీసుకొచ్చి కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులు అప్పగించారు. నిండు ప్రాణాన్ని కాపాడిన గజ ఈతగాళ్లను పలువురు అభినందించారు.

బాలల హక్కుల పరిరక్షణలో కీలకపాత్ర



మాట్లాడుతున్న తహసీల్దార్ పి.రామ్మోహన్

రాజోళి: బాలల హక్కులను పరిరక్షించడంలో బాలల హక్కుల పరిరక్షణ సమితి కీలకపాత్ర వహిస్తుందని మండల విద్యాధికారి భగీరథరెడ్డి, తహసీల్దార్ పి.రామ్మోహన్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు.వారు మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు చేస్తున్న కార్యక్రమాల్లో బాలల పరిరక్షణ సమితి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సభ్యులు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో సిబ్బంది కొరత వేధిస్తుందని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి, సీఆర్‌పీఎఫ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ల విడుదల

గద్వాల అర్బన్: వికారాబాద్‌లోని నేవీ రాడార్ స్టేషన్‌ను వ్యతిరేకిస్తూ సుగుణ వర్ధంతి, నిర్దోషి అయి 10ఏళ్ల నిర్బంధాన్ని అనుభవించిన సాయిబాబాను స్మరించుకునేందుకు ఈనెల 27న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో సభను నిర్వహించనున్నామని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో కరపత్రాలు విడుదల చేశారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు పంపిణీ



ఎర్సందొడ్డిలో పశువులకు టీకాలు వేస్తున్న



మల్లెందొడ్డిలో..

మల్దకల్: వర్షాకాలంలో సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని మల్లెందొడ్డిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు వచ్చే గాలికుంటు వ్యాధి నివారణ కోసం రైతులు తమ పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలన్నారు. గ్రామంలో 454 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు యామిని సాయి, ఉష, సిబ్బంది రామాంజనేయులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కేటీదొడ్డి: పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల పశువైద్య సహాయకుడు వెంకటేష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎర్సందొడ్డిలోని ఆవులు ఎద్దులు 187, గేదెలు 65 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేట్ మోహన్, గోపాల్ మిత్రలు గోపాల్‌రెడ్డి, బీమయ్య తదితరులు ఉన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని గొందిమల్ల, భైరంపల్లి గ్రామాల్లో శుక్రవారం పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు, గాలికుంటు నివారణ టీకాలను వేశారు. ఈ సదర్భంగా జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి వచ్చిన పశువుల్లో నోటిలో, గిట్టల మధ్యలో పుండ్లు కావటం, చొంగకారటం, పశువులు మేత తినకపోడం, జ్వరం ఉండటం వంటి లక్షణాలు కన్పిస్తాయన్నారు. 85 ఆవులు, 196 గేదేలు మొత్తం 281 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలను వేసినట్లు పుశువైద్య అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రమేష్, అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటనారయణ, డాక్టర్లు శంకరయ్య, శిరీష, వెంకటరాజు, రంజిత్, జేవీఓ శ్రీశైలం, వీఏ యుగంధర్, వీఏ శాంతి, ఓఎస్ ప్రకాష్, గోపాలమిత్ర ఠాగురనాయుడు, ప్రసాద్ నాయుడు, పాడి రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బ్యాంకు సేవలు పొందాలి



మాట్లాడుతున్న ఏపీజీవీబీ మేనేజర్ రాఘవేందర్‌రెడ్డి

ఎర్రవల్లి: మండలంలోని రాజశ్రీగార్లపాడులో ఏపీజీవీబీ, సాసనూలు శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ వీక్ అవెర్నెస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ రాఘవేందర్‌రెడ్డి పంట రుణాలు, రైతు రుణమాఫీ, ఇన్సూరెన్స్ పథకాలు, సైబర్ మోసాలతో పాటు బ్యాంకులో ఉండే వివిధ పథకాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతి ఖాతాదారుడు తప్పకుండా మొబైల్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవాలని తెలిపారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి, బ్యాంక్‌ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఏటీఎం రూపే కార్డులను వినియోగించి, లావాదేవీలను సులభతరం చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో ఏమైనా పనులు ఉంటే మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా బ్రాంచ్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సాయి కుమార్, సీఎఫ్ఎల్ కౌన్సిలర్ మధు, కృష్ణ, రవి, బ్యాంకు మిత్ర బృందం, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

భక్తిభావంతోనే మానసిక ప్రశాంతత



పారాయణం చేస్తున్న జీయర్ స్వామి శిష్యులు

మల్దకల్: మారుతున్న కాలానుగుణంగా ప్రతి ఒక్కరూ భక్తిభావం పెంచుకోవాలని సత్యప్రకాష్, పాండుస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని అమరవాయి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో చిన్న జీయర్‌స్వామి శిష్యబృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభాగవత సప్తాహ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిన్నజీయర్ స్వామి శిష్యబృందం సభ్యులు వీరయ్య, నారాయణరెడ్డి, నల్లారెడ్డి భక్తులకు పారాయణం వినిపించారు. ప్రతి ఒక్కరూ చెడును వీడి మంచి అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకట్రామిరెడ్డి, తిమ్మారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, సత్యమ్మ, విక్రంసింహారెడ్డి, పాండురంగారెడ్డి, ఈశ్వరయ్య, లోకేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పెద్ద ధన్వాడ ప్రజలతో చర్చిస్తాం’

రాజోళి: మండలంలోని పెద్ద ధన్వాడలో గురువారం గ్రామస్తులు ఫ్యాక్టరీ పనులను అడ్డగించిన సంగతి తెలిసిందే. దానికి సంబంధించి గ్రామస్తులతో త్వరలోనే చర్చలు జరుపుతామని ఫ్యాక్టరీ లైజనింగ్ ఆఫీసర్ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ శివారులో నెలకొల్పుతున్న ఫ్యాక్టరీ ద్వారా నష్టాలు ఉన్నాయనేది కేవలం అపోహ మాత్రమే అన్నారు. దేశంలో ఇలాంటి ఫ్యాక్టరీలు వందకు పైగా ఉన్నాయని, తెలంగాణ, ఏపీ ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీల వద్దకు గ్రామస్తులను తీసుకెళ్లి వారికి అవగాహన కల్పిస్తామన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులు, యువతకు, గ్రామాల అభివృద్ధికి ఎలాంటి మేలు జరుగుతుందో అవగాహన కల్పిస్తామన్నారు. దీనికి సంబంధించి రెవెన్యూ, పోలీసు అధికారులను సంప్రదించి, ప్రజలతో సంయుక్త సమావేశానికి సమయం కేటాయించాలని కోరుతామమన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగేలా ఎలాంటి చర్యలు ఉండవని ఆయన స్పష్టం చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

గట్టు: విద్యార్థులు పట్టుదలతో చదువుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ హృదయరాజు అన్నారు. శుక్రవారం గట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైకాలజిస్టు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. రోజురోజుకు మారుతున్న కాలానుగుణంగా ప్రతి విద్యార్థి మానసిక ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగ చేయడంతో పాటు మానసిక ఆందోళన తగ్గుతుందన్నారు. మానసిక ఆందోళన లేకుండా విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రాజు, అధ్యాపకులు రాజగోపాల్, మహేష్, భరత్, రంగస్వామి, దిలీప్, విష్ణు, అంజి, శ్రీజ, సుప్రజ, గోపాల్, రమేష్, మోహన్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



లెక్చరర్‌కు సన్మానం



అయిజ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ రాములు ఆధ్వర్యంలో లెక్చరర్ శశిధర్‌రెడ్డిని తోటి లెక్చరర్లు శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రాములు మాట్లాడుతూ.. అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర ఉపన్యాసకులుగా పనిచేస్తున్న శశిధర్‌రెడ్డిని జోగుళాంబ గద్వాల జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపిక చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ గెజిటెడ్ ఆఫీసర్స్ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు రంగన్న, రాజేందర్, కృష్ణవర్ధన్, చలపతిరెడ్డి, గాయిత్రి, బాలస్వామి, నరేష్ కుమార్, శ్రీరాములు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవాలి



గట్టు: వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా వాటిని ఒడిసి పట్టుకోవాలని జలశక్తి అభియాన్ రాష్ట్ర బృందం సభ్యులు మధుసూదన్, నర్సింగరావు రైతులకు సూచించారు. శుక్రవారం గట్టు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో వారు మాట్లాడుతూ భావితరాలకు నీటి కొరత లేకుండా స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నారీశక్తిచే జలశక్తి అనే నినాదంతో మహిళలు భాగస్వాములు కావాలన్నారు. వ్యవసాయ పొలాలు, ఇంటి పరిసరాల్లో ఇంకుడు గుంతలు నిర్మించి భూగర్భజలాలను పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గట్టు లిఫ్టు ఇరిగేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ రహీముద్దీన్, శ్రీనివాస్, ఎంపీడీఓ చెన్నయ్య, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.